- చివరి తేదీ అంటూ ఏమీ ఉండదు
- చివరి వినియోగదారు వరకు అప్‌డేట్
- స్పష్టం చేస్తున్న గ్యాస్ ఏజెన్సీలు
- సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు నమ్మొద్దని అధికారుల సూచన

# గ్యాస్ ఈకేవైసీకి తొందరేం లేదు

కరీంనగర్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : వంట గ్యాస్ వినియోగదారులు తమ కనెక్షన్లను అప్‌డేట్ చేసుకోవాలని నిజానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే, దీనికి ఎలాంటి చివరి తేదీ లేదు. కానీ, కొన్ని గ్యాస్ ఏజెన్సీలు ఈ నెల 31 వరకు చివరి తేదీ ఉన్నట్లు వినియోగదారుల సెల్ ఫోన్లకు మెస్సేజ్‌లు పంపుతున్నాయి. మరో పక్క సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈకేవైసీ చేసుకుంటేనే రాష్ట్ర ప్రభుత్వం రూ.500 గ్యాస్ పంపిణీ చేస్తుందనే పుకార్లు కూడా పుట్టాయి. దీంతో ఆందోళనకు గురవుతున్న వినియోగదారులు వీలైనంత తొందరగా తమ గ్యాస్ కనెక్షన్ల ఈకేవేసీ ద్వారా అప్‌డేట్ చేసుకోవాలనే ఆలోచనకు వచ్చారు. నవంబర్ నెల నుంచే ఈ ప్రక్రియ నడుస్తున్నప్పటికీ ఈ నెలలో ఎక్కువ ప్రచారం జరిగింది. ఈకేవైసీ చేసుకుంటేనే రూ.500 గ్యాస్ పంపిణీ వర్తిస్తుందని పుకార్లు లేవడంతో వినియోగదారులు ఒక రకంగా ఆందోళన చెందుతున్నారు. ఈ నెలాఖరు వరకే అవకాశం ఉందని కొన్ని గ్యాస్ ఏజెన్సీలు కూడా వినియోగదారుల సెల్ ఫోన్లకు మెస్సేజ్‌లు పంపిస్తున్నాయి. అయితే, వీటిలో రూ.500ల గ్యాస్ ప్రస్తావన లేనప్పటికీ చాలా మంది వినియోగదారులు దాని కోసమే అన్నట్లుగా భావించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు.

### ఈకేవైసీ తీసుకోవడం ఎందుకు?

నిజానికి ఈకేవైసీ అనేది రాష్ట్రంలో కొత్త ప్రభు త్వం రాకముందు నుంచే జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు రూ.200 తగ్గించిన తర్వాతనే ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది. గ్యాస్ కనెక్షన్లు ఎవరి పేరు మీద ఉంది. కనెక్షన్ పొందిన లబ్ధిదారులే గ్యాస్ వాడుతున్నారా, ఇతరులు ఎవరైనా వాడుతున్నారా, కనెక్షన్ పొందిన ప్రదేశంలోనే దానిని వాడుతున్నారా, ఇతర ఏ ప్రాంతానికికైనా తరలించారా? అనే విషయాలను క్లుప్తంగా తెలుసుకునేందుకు బ్యాంకు అకౌంట్ నంబర్లు, ఆధార్ నంబర్లను ఏ విధంగానైతే అప్‌డేట్ చేసుకోవడం కోసం ఈకేవైసీ విధానాన్ని వినియోగించారో అదే విధంగా గ్యాస్ కనెక్షన్లను కూడా అప్‌డేట్ చేయాలని కేంద్ర ప్రభు త్వం గ తంలోనే గ్యాస్ కంపెనీలను ఆదేశించింది. దీంతో భారత్, ఇండెన్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీలు ఈ ప్రక్రియను గత నెలలోనే ప్రారంభించాయి. తమ పరిధిలోని వినియోగదారుల సెల్ ఫోన్లకు మెస్సేజీల ద్వారా సమాచారాన్ని పంపిస్తున్నాయి. మంద కొడిగా అయినా కొంత మంది వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్‌ను అప్‌డేట్ చేయించుకుంటు న్న సమయంలో ఈకేవైసీ చేయించుకుంటేనే రూ.500కే గ్యాస్ పంపిణీ చేస్తారని పుకార్లు పుట్టాయి.

### ఉజ్వల కనెక్షన్లకు సబ్సిడీ వస్తుందా లేదా?

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ తీసుకోవడంలో మరో కోణం కూడా కనిపిస్తోంది. గతంలో ఉజ్వల పథకం కింద కనెక్షన్లు పొందిన వారిలో ఎంత మంది వాడుతున్నారు. వాడుతున్న వారికి కేంద్రం ఇస్తున్న రూ.300 సబ్సిడీ వస్తున్నదా లేదా? అనే విషయాలతోపాటు ఇంకా ఎంత మందికి గ్యాస్ కనెక్షన్లు అవసరం ఉంటాయనే లెక్కలు కూడా ఈ ప్రక్రియ ద్వారా తేలే అవకాశాలు ఉంటాయని తెలుస్తోంది. ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు తీసుకున్న వినియోగదారుల్లో ఎంత మంది ఉపయోగించుకుంటున్నారనే విషయం కూడా ఈ ప్రక్రియ ద్వారా వెల్లడయ్యే అవకాశం ఉంటుంది.

### చివరి తేదీ అంటూ ఏమీ లేదు

గ్యాస్ కనెక్షన్లకు ఈకేవైసీ చేసుకునే ప్రక్రియకు చివరి తేదీ అంటూ ఏమీ లేదని, దీనికి, ప్రభుత్వానికి ఎలాంటి సంబంధమూ లేదని పౌర సరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. కేంద్రం కేవలం గ్యాస్ కంపెనీలకు మాత్రమే ఈ బాధ్యతలను అప్పగించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి సురేశ్‌రెడ్డి తెలిపారు. అయితే, జిల్లాలోని 21 ఏజెన్సీల్లో గత రెండు మూడు రోజులుగా ఈ ప్రక్రియ శర వేగంగా కొనసాగుతోంది. జిల్లాలో 3,12,206 గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఒక్కో ఏజెన్సీలో నాలుగైదు కౌంటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్లను ఈకేవైసీ చేయించుకోవాలంటే సంబంధిత గ్యాస్ కనెక్షన్ పాసు పుస్తకంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని వెంట తీసుకుని వెళ్లాలి. ఏజెన్సీలు ఏర్పాటు చేసిన కౌంటర్లకు వెళ్లి బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేయాలి. ఒకవేళ వేలి ముద్రలు రాకుంటే ఐరిస్ ద్వారా డాటా ఎంట్రీ పూర్తి చేస్తున్నారు. మూడు నాలుగు రోజులుగా జరుగుతున్న పుకార్ల కారణంగా ఏజెన్సీల్లో తాకిడి పెరిగింది. దీంతో కొన్ని ఏజెన్సీలు వినియోగదారులకు టైం కేటాయిస్తూ టోకెన్లు కూడా ఇస్తున్నాయి. టైంకు వచ్చి ఈకేవైసీ చేయించుకుంటే సరిపోతుందని, చివరి తేదీ అంటూ ఏమీ లేదని ఒక పక్క గ్యాస్ ఏజెన్సీల డీలర్లు కూడా చెబుతున్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 12 : పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించాలని, ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధం కావాలని, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయన్నారు. కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్, వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్‌కు సంబంధించి పీవో, ఏపీవో, ఓపీవోల రవాణా, నోడల్ అధికారుల నియామకం, అవసరమైన మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక రూపొందించుకుని, ఎన్నికల సంసిద్ధతపై సమీక్షించుకోవాలని సూచించారు. అవసరమైన మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్‌ను చూసుకోవాలన్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఇతర ప్రతినిధులతో సమీక్షించి రెండు కి.మీ.కన్నా ఎక్కువ దూరంలో పోలింగ్ కేంద్రాలున్నా, 1300 మంది కన్నా అధికంగా ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉన్నా గుర్తించాలని ఆదేశించారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో మరణించిన, బదిలీ అయిన, డూప్లికేట్ ఓట్లు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు బెన్‌సలాన్, ఆనంద్‌కుమార్, మధుసూదన్ ఉన్నారు.



కేసీఆర్‌తో ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేటీఆర్

# కేసీఆర్‌కు మంత్రి, మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

మంథని/గోదావరిఖని/ తిమ్మాపూర్, డిసెంబర్ 12: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్‌ఎస్ నాయకుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మంగళవారం వేర్వేరుగా పరామర్శించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద దవాఖానకు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దవాఖాన ఆవరణలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, రసమయి బాలకిషన్, బీఆర్‌ఎస్ నాయకుడు గెల్లు శ్రీనివాస్

# బాయిలర్ కోళ్ల రైతులను ఆదుకోవాలి

- బాయిలర్ కోళ్ల రైతుల వేడుకోలు
- హైదరాబాద్‌లో ధరల నియంత్రణపై ప్రతినిధుల చర్చ



హైదరాబాద్‌లో సమావేశమైన పౌల్ట్రీ రైతులు

విద్యానగర్, డిసెంబర్ 12 : కోళ్ల ధరలు పడిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని తమను ఆదుకోవాలని బాయిలర్ కోళ్ల రైతులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోగల తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో శ్రీవేంకటేశ్వర పౌల్ట్రీ హేచరీ జనరల్ మేనేజర్ ఆనంద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో బాయిలర్ కోళ్ల రైతుల రాష్ట్ర కమిటీ ప్రతినిధులతో తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ధరల నియంత్రణపై సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ, ధరల్లో వ్యత్యాసంతో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. కోడి ధర పేపర్‌పై ఒకటి, సప్లైపై మరొకటి ఉంటోందని కొన్ని రోజులుగా ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీని నియంత్రణ కోసం ఇంటిగ్రేషన్ పౌల్ట్రీ యజమానులు, బ్రీడర్స్ పౌల్ట్రీ యజమానులు, రైతు ప్రతినిధులతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. తద్వారా ధరల నియంత్రణ ఒక కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా నుంచి పాల్గొన్న పలువురు బాయిలర్ కోళ్ల రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. కోళ్ల ధరలు పడిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరింత నష్టాల్లో కూరుకుపోక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్నేహ ఎండీ రాంరెడ్డి, కోహినూర్ ఎండీ రాఘవరావు, ఎస్‌ఆర్ ఎండీ తిరుపతి రెడ్డి, బాయిలర్స్ రైతు సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి సభ్యులు విఠల్ రెడ్డి, దారం జగన్నాథ రెడ్డి, వెంకటేశ్వర రావు, మధుగౌడ్, మోహన్ బాబు, ఈశ్వర్, రాజిరెడ్డి, రాజేశం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

CHANGE OF NAME

★I, NAGARAJU VEERAKUMARI, D/o. Sathaiah, R/o. Q.No. ST2-703, Centenary Cly., Ramagiri, Peddapalli, TS, have Changed My Name as BOGGAM UMARANI, W/o. Boggam Sudheer.
NT-324458

★I, AMTUL NOOR, W/o. Mohammed Zahid Gahaffar, R/o. 10-29/2/A1, Razvi Chaman, Bommakal, Karimnagar, TS, Changed My Son Name from MOHAMMED ZAIN ZAHID to MOHAMMED ZAIN GHAFFAR.
NT-324458

★I, ALLE NARSU, D/o. Rajesham, R/o. 1-1-1207/2, Pochammaveedhi, Madhariwada, Korutla, Jagityal, TS, Changed My Name as CHILUVERI MADHURI, W/o. Uday Prasad.
NT-324458

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194